www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 8 అక్టోబర్ 2024

5

ఏలూరు

ఇసుక సమస్యను పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇసుక సమస్యను తక్షణమే పరిష్కరించాలని, ఉన్న వాస్తవ పరిస్థితిని ప్రకటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇసుక కోసం ఆన్‌లైన్‌లో వెతుకుతుంటే నో సాండ్ అని వస్తుందని తెలిపారు. ఇసుక దొరకక తీవ్ర అగచాట్లు పడుతున్నారని పేర్కొన్నారు. మరోపక్క ఉచిత ఇసుక విధానమని బోర్డులు ఉన్నాయి తప్ప ఆచరణలో గతం కంటే ధరలు పెరిగాయని తెలిపారు. ఈ పరిస్థితిని చక్కదిద్దాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఇసుక సమస్యపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఎం చంద్రబాబు ఆదేశించడం సరికాదని పేర్కొన్నారు. ఇసుక దొరకడం లేదని అంటున్నారని, దొరికేలా చూడాలని, ఎక్కడ ఎంత ఇసుక ఉందో వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని పేర్కొన్నారు. గతం కంటే ఇసుక ధరలు పెరిగిన మాట వాస్తవమా కాదా అని కూటమి ప్రభుత్వ పార్టీల నేతలను అడిగినా చెబుతున్నారని పేర్కొన్నారు.

'మండలి' పోరుకు సన్నాహాలు

ఓటర్ల నమోదులో అధికార యంత్రాంగం

15 వరకూ కొత్త ఓట్ల నమోదుకు అవకాశం

నవంబర్ 6న తుది ఓటర్ల జాబితా

ప్రజాశక్తి - డెస్క్

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నికకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన పిడిఎఫ్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ గతేడాది డిసెంబర్‌లో రోడ్డు ప్రమాదంలో మరణించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. త్వరలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. ఓటర్ల నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఏలూరు, పశ్చిమగోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలతోపాటు అల్లూరి సీతారామరాజు జిల్లాలో కలిసిన 11 మండలాలతోపాటు మొత్తం 116 పోలింగ్ స్టేషన్ల పరిధిలో అర్హులైన ఉపాధ్యాయుల ఓటు నమోదుకు జులై 29 నుంచి ఫారం-19 ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. సెప్టెంబర్ మూడో తేదీతో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసినట్లు అధికారులు తెలిపారు. వచ్చిన దరఖాస్తుల జాబితాలను గత నెల 24న పోలింగ్ కేంద్రాలైన తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల్లో ప్రదర్శించారు. గత నెలలో గడువు ముగిసేటప్పటికి నియోజకవర్గ పరిధిలో ఉపాధ్యాయుల నుంచి 14,388 దరఖాస్తులురాగా అందులో 13,677 దరఖాస్తులను అంగీకరించి 79 దరఖాస్తులను తిరస్కరించారు.

15 వరకూ కొత్తగా ఓట్ల నమోదు

గడువులోగా దరఖాస్తు చేసినా పేరు లేకపోతే మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం ఇచ్చారు. ఈ నెల 15వ తేదీ వరకూ ఓటు నమోదుకు అవకాశం కల్పించారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిశీలన గత నెల 24 నుంచి మొదలైంది. ఈ నెల 30 వరకూ అన్నింటినీ పరిష్కరిస్తారు. అలాగే సప్లిమెంట్ జాబితాలు తయారు చేసి నవంబర్ 6న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. అనంతరం ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఉపాధ్యాయుడిగా మూడేళ్లపాటు పని చేసిన వారికే ఓటరుగా అర్హత ఉంటుంది. జిల్లా బయటి నుంచి వచ్చి ఉద్యోగం చేసే వారికి ఓటు పొందే అవకాశం లేదు. జిల్లాలో నివాసం ఉండే ఉపాధ్యాయులకే ఓటు హక్కు అవకాశం ఉంది.

ఆసక్తిగా మారిన ఉప ఎన్నిక

పిడిఎఫ్ అభ్యర్థిగా బి.గోపీమూర్తి ఖరారు

ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నిక ఆసక్తిగా మారనుంది. ఎక్కువమంది టీచర్లు ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి ఉత్సాహం చూపిస్తున్నారు. ఈసారి పోటీ ఎలా ఉంటుందోననే చర్చ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో జోరుగా సాగుతోంది. ఇప్పటికే నాలుగు దఫాలు ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలు జరిగాయి. 2007 నుంచి 2009 వరకూ శేషారెడ్డి, రెండోసారి 2010 నుంచి 2015 వరకూ చైతన్యరాజు, మూడోసారి రాము సూర్యారావు, నాలుగోసారి 2021 మార్చి 17న జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సిగా షేక్ సాబ్జీ విజయం సాధించారు. ఆయన 2023 డిసెంబర్ 15న రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఆ ఎన్నికల్లో నియోజకవర్గంలో మొత్తం 17,467 మంది ఓటర్లుండగా 16,054 ఓట్లు పోలయ్యాయి. 11 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. షేక్ సాబ్జీకి 7,987 ఓట్లు రాగా, వైసిపితో పాటు పిఆర్‌టియు, ఇతర ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో బరిలోకి దిగిన సమీప ప్రత్యర్థి గంధం నారాయణరావుకు 6,453 ఓట్లు పోలయ్యాయి. దీంతో షేక్ సాబ్జీ 1,534 ఓట్ల మెజారిటీతో మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో టిడిపి మద్దతు తెలిపిన చెరుకూరి సుభాష్ చంద్రబోసుకు 106 ఓట్లు, బిజెపి మద్దతుతో పోటీ చేసిన ఇళ్ల సత్యనారాయణకు 300 ఓట్లు పడ్డాయి. పిడిఎఫ్ తరపున ఎంఎల్‌సిలుగా గెలుపొందిన రాము సూర్యారావు, షేక్ సాబ్జీ పనితీరుపై ఉపాధ్యాయ వర్గాల్లో పూర్తి సంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో పిడిఎఫ్ అభ్యర్థిగా యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి పేరు ఖరారైంది. ఆపై ఆయన ప్రచారం సైతం పశ్చిమగోదావరి జిల్లా నుంచి ప్రారంభించారు. వచ్చే ఎన్నికల్లో కూడా పిడిఎఫ్ విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని పలువురు అంచనా వేస్తున్నారు.

ఏలూరులో...

ఇజ్రాయిల్ దాడులు ఆపాలని వామపక్షాల నిరసన

బుట్టాయగూడెంలో...

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ ఆయుధాలతో చేస్తున్న దాడులను నివారించాలని, ఈ దాడులను అరికట్టేలా మన ప్రధాని జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో నిరసన చేపట్టారు. సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షత వహించగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ వైమానిక దాడులు మొదలుపెట్టి నేటికీ సంవత్సరమైందని, సుమారుగా 85 వేల మంది ప్రజలు ఈ దాడుల్లో మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడులు అమెరికన్ సామ్రాజ్యవాదుల కనుసైగల్లో జరుగుతున్నాయన్నారు. ఆర్థిక సంక్షోభం నుండి బయటపడటానికి ప్రపంచంలో యుద్ధాలను ప్రేరేపిస్తున్న అమెరికన్ సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా ప్రజలంతా పోరాడాలని పిలుపునిచ్చినారు. పాలస్తీనాలోని ఆయిల్ నిక్షేపాలను కొల్లగొట్టాలనే దురుద్దేశంతో ఈ దాడుల సాగుతున్నాయన్నారు. ఈ దాడులను అరికట్టే దిశగా మన ప్రధాని మోడీ ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఆహార ఉత్పత్తులు, ఆయిల్ నిక్షేపాలకు కరువు వచ్చే పెనుప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్, నాయకులు పి.ఆదిశేషు, శ్యామలారాణి, జి.శారద, బి.జగన్నాథరావు, గోపీ, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు యర్రా శ్రీనివాస రావు, కాకి నాని, ఎం క్రాంతి, సిపిఐ నాయకులు బండి వెంకటేశ్వరరావు, ఉప్పులూరి హేమశంకర్, రెడ్డి శ్రీనివాస్ డాంగే తదితరులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: పాలస్తీనాపై ఇజ్రాయిల్ ఆటవిక దాడులను నిరసిస్తూ సిపిఎం, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ధర్ముల సురేష్, తెల్లం రామకృష్ణ, కారం రాఘవ, అందుగుల ఫ్రాన్సిస్, తగరం బాబూరావు, మొడియం నాగమణి మాట్లాడుతూ తక్షణమే యుద్ధాన్ని ఆపాలని, కాల్పుల విరమణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అలివేరు సర్పంచి కారం లక్ష్మి, కట్టం నాగేశ్వరరావు, కెచ్చల పోతిరెడ్డి, కొమరం నాగార్జున, కె.ప్రతాప్, పూనం రాము, మిర్తివాడ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే కొత్త ఇసుక రీచ్‌లు

జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి

ఇసుక అక్రమ రవాణా చేస్తే ఉపేక్షించం

జిల్లా ఎస్‌పి కె. ప్రతాప్ శివకిషోర్

మాట్లాడుతున్న జెసి, ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో మరో నెల రోజుల్లో పట్టిసీమ, గూటాల, గూటాల-1 ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి చెప్పారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో ఉచిత ఇసుక అమలు విధానంపై జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్‌తో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా జెసి ధాత్రిరెడ్డి మాట్లాడుతూ త్వరలోనే పోలవరం మండలం పట్టిసీమ, గూటాల, గూటాల-1 డీసిల్టేషన్ పాయింట్ల ద్వారా ఇసుకను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. తద్వారా సుమారు 60 వేల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యమయ్యే అవకాశం ఉందన్నారు. ఉచిత ఇసుక అమలులో ప్రజలకు వెసులుబాటు కల్పిస్తూ ఏర్పాటు చేసిన ఫెసిలిటీ సెంటర్ ద్వారా జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా ప్రజలకు సేవలు అందిస్తుందన్నారు. సెప్టెంబరు 28 నుండి అక్టోబరు 6వ తేదీ వరకు 546 మంది 10 టన్నుల పైబడి ఇసుక బుక్ చేసుకున్నారన్నారు. కుక్కునూరు మండలం ఇబ్రహీంపేట రీచ్‌లో ప్రస్తుతం 26 వేల టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయన్నారు. నిత్యం 500 టన్నుల చొప్పున బుకింగ్స్ జరిగినా మరో నెల రోజుల వరకు సరిపడేలా జిల్లాలో ఇసుక నిల్వలు ఉన్నాయన్నారు. ఉచిత ఇసుక విధానంలో ఏదైనా సమస్యలు ఉంటే జిల్లాస్థాయి టోల్‌ఫ్రీ నెం. 1800-425-6025, 08812-234014 ద్వారా ఫెసిలిటీ సెంటర్‌ను సంప్రదించవచ్చునన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా వినియోగదారులు ఎపి శాండ్ పోర్టల్ ద్వారా ఇసుకను బుక్ చేసుకోవచ్చన్నారు. జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానం ద్వారా ప్రజలకు పారదర్శకంగా ఇసుక అందించటమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఏదైనా అక్రమాలకు పాల్పడినా, దళారీ వ్యవస్థ ఉన్నా చర్యలకు ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఎక్కడైనా అక్రమాలు చోటుచేసుకుంటే 112కి కాల్ చేసి సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. జీలుగుమిల్లి వద్ద చెక్‌పోస్టును ఏర్పాటు చేశామన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై గొంతు వినిపిస్తా

పిడిఎఫ్ టీచర్స్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తి

షేక్ సాబ్జీ, ఎస్ఆర్.పోలిశెట్టి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న గోపీమూర్తి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రెండు జిల్లాల ఉపాధ్యాయ, అధ్యాపక మిత్రులు తనకు ఓటు వేసి గెలిపించాలని, ప్రభుత్వ, ప్రయివేట్, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలపై శాసనమండలిలో తన గొంతు వినిపిస్తానని యుటిఎఫ్ బలపరిచిన ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపీమూర్తి అన్నారు. ఆయన సోమవారం ఏలూరు పట్టణంలో పర్యటించారు. అనంతరం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా ప్రాంతీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థిగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గం తనను ప్రతిపాదించిందని తెలిపారు. తాను విద్యార్థి దశలోనే విద్యార్థి ఉద్యమంలో పాల్గొని విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేశానని, 1998 ఆగస్టులో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించి నాటి నుంచి నేటి వరకూ ఉపాధ్యాయ, ప్రభుత్వ విద్యారంగ సమస్యలపై జరిగిన అన్ని పోరాటాల్లో పాల్గొన్నానన్నారు. అప్రెంటీస్ వ్యవస్థ రద్దు, సిపిఎస్ రద్దు పోరాటాల్లో పాల్గొన్నానని తెలిపారు. పిడిఎఫ్ ఎంఎల్‌సిల ఆదర్శాలను కొనసాగిస్తానన్నారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకత్వాని కలిసి మద్దతు కోరారు. జెఎసి ఛైర్మన్ చోడగిరి శ్రీనివాసరావు, సెక్రటరీ జనరల్ నేరుసు రామారావును మద్దతు కోరారు. శ్రీనివాసరావు, రామారావు మాట్లాడుతూ జెఎసి తరపు నుంచి సంపూర్ణమైన మద్దతు ఉంటుందని చెప్పారు. హెచ్ఎం అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డి.వి.రమణ, ప్రధాన కార్యదర్శి జి.ప్రకాష్ మద్దతు తెలిపారు. గోపీమూర్తి విజయానికి కృషి చేస్తామన్నారు. ఉభయగోదావరి జిల్లాల పూర్వపు ఉపాధ్యాయ ఎంఎల్‌సి రాము సూర్యారావును కలిసి మద్దతు కోరగా ఆయన సంపూర్ణమైన మద్దతు తెలిపారు. అనంతరం డివిజన్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కీర్తిశేషులు ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ చిత్రపటానికి, పూర్వపు జిల్లా, రాష్ట్ర నాయకులు ఎస్ఆర్.పోలిశెట్టి చిత్రపటానికి గోపీమూర్తి పుష్పమాలంకరణ చేసి జోహార్లు అర్పించారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫా ఆలీ, రవికుమార్ రుద్రాక్షి, రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిని, జిల్లా కార్యదర్శులు నంబూరి రాంబాబు, ఎస్.సుధారాణి, జిల్లా ఆడిట్ కన్వీనర్ బి.మోహన్‌రావు పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమమే లక్ష్యం

ఎఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

సిబ్బంది సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని జిల్లా అదనపు ఎస్‌పి నక్క సూర్యచంద్రరావు తెలిపారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన సోమవారం అదనపు ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించారు. 2014 డిఎస్‌పి బ్యాచ్‌కు చెందిన సూర్యచంద్రరావు మొట్టమొదటిగా విజయవాడ స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పిగా పని చేశారు. అనంతరం తిరుపతి రైల్వే డిఎస్‌పిగా, నెల్లూరు డిటిసి డిఎస్‌పిగా, విజయవాడ సౌత్ ఎసిపిగా, విజయనగరంలో డిఎస్‌పిగా పని చేశారు. 2021లో అదనపు ఎస్‌పిగా ఉద్యోగోన్నతి పొందారు. ఏలూరు జిల్లా సెబ్ ఎఎస్‌పిగా నియమితులై పని చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లా ఎఎస్‌పిగా నియమితులై బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సూర్యచంద్రరావు మాట్లాడుతూ సిబ్బంది ఎవరైనా.. ఎటువంటి సమస్యనైనా తనను నేరుగా కలిసి తెలియజేయాలని సూచించారు. అనంతరం కార్యాలయ సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆపై ఎఎస్‌పి సూర్యచంద్రరావు ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్‌ను, డిఐజి అశోక్ కుమార్‌ను, జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి

జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం



కరీంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అధికారి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రోడ్డు భద్రతకు ప్రాధాన్యతనిచ్చి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తానని ఏలూరు జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం అన్నారు. స్థానిక జిల్లా ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో నూతన డిటిసిగా షేక్ కరీం సోమవారం సాయంత్రం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న వాహన తనిఖీ అధికారులు, ఏలూరు ఆర్‌టిఒ ఎం.కృష్ణారావు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందించారు. ఈ సందర్భంగా డిటిసి కరీం మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా పని చేస్తున్న రవాణా తనిఖీ అధికారులతో ముఖాముఖి నిర్వహించానని తెలిపారు. జిల్లాలో రోడ్డు భద్రత నియమాల అమలు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన అంశాలపై చర్చించామన్నారు. స్థానిక విద్యాసంస్థలు మొదలుకుని ఇంజినీరింగ్ కళాశాలల వరకు పూర్తిగా విద్యార్థుల్లో రోడ్డు ప్రమాదాలపై అవగాహనకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. హెల్మెట్ వాడకం, సీట్‌బెల్టు వినియోగంపైనా ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు చేపట్టనున్నామని ఆయన తెలిపారు. అనంతరం ఆయనను డిటిసి కార్యాలయ నాన్ టెక్నికల్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు రవాణా శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాల్‌మనీ కేసులో ఇద్దరు అరెస్టు

ప్రధాన నిందితుల కోసం పోలీసులు గాలింపు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు నగరంలో కాల్ మనీ వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. ఈ కేసులో ఒకటో పట్టణ పోలీసులు అత్యంత ప్రతిభ కనబరిచి నలుగురు నిందితుల్లో ఇద్దరిని అరెస్టు చేశారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కాల్ మనీ వేధింపులకు గురైన బాధితురాలు సుబ్బలక్ష్మి ఫిర్యాదు చేశారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సుబ్బలక్ష్మి భర్త పౌరోహిత్యం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈ క్రమంలో 2011లో మేడపాటి సుధాకర్‌రెడ్డి అనే వ్యక్తి దగ్గర డబ్బులు అప్పుగా తీసుకుని తిరిగి చెల్లించారు. 2019లో రూ.1.20 లక్షలు తీసుకుని వారానికి రూ.మూడు వేల చొప్పున కడుతూ రూ.ఆరు లక్షల వడ్డీని చెల్లించారు. ఈ సొమ్ములు మొత్తం ఫోన్‌పే ద్వారా చెల్లించినప్పటికీ అప్పు చెల్లించలేదని, ఇంకా రూ.6.50 లక్షలు వడ్డీ చెల్లించాలని మేడపాటి సుధాకర్ రెడ్డి తమను వేధిస్తున్నాడని, ఖాళీ నోట్లపై, చెక్కులపై సంతకాలు చేయించుకుని కోర్టులో కేసులు నమోదు చేశారని, ఇంట్లో సామగ్రి అక్రమంగా పట్టుకుపోయారని, అంతటితో ఆగకుండా కుటుంబ సభ్యులను, మహిళలను చంపేస్తామని బెదిరిస్తూ మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు మేడపాటి సుధాకర్‌రెడ్డి, అతని భార్య లావణ్య, సుధాకర్‌రెడ్డి అనుచరులు విద్యాసాగర్, రాజేష్, మహమ్మద్‌షకిల్‌రెహమాన్‌లతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేశారు. ఈ నిందితుల్లో ఏలూరు నగరానికి చెందిన విద్యాసాగర్, మహమ్మద్ షకిల్ రెహమాన్‌లను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామని డిఎస్‌పి తెలిపారు. ప్రధాన నిందితులైన సుధాకర్‌రెడ్డి, అతని భార్య కోసం గాలింపు చర్యలు చేపట్టామని చెప్పారు. నిందితుడు పరారీలో ఉన్నప్పటికీ అతనికి సంబంధించిన బ్యాంకు ఖాతాలను సీజ్ చేశామని, ఖాతాలో రూ.48 లక్షల నగదు ఉన్నట్లు గుర్తించామని ఆయన తెలిపారు. ప్రస్తుతం సుధాకర్‌రెడ్డి బాధితులు 58 మంది ఉన్నట్లు ప్రాథమిక సమాచారంగా తెలుస్తుందని చెప్పారు. పలు ప్రాంతాల నుంచి అతనిపై మొత్తం ఐదు కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితుల కోసం రెండు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపడుతున్నాయన్నారు. ఎవరైనా కాల్ మనీ వేధింపులకు పాల్పడితే వెంటనే తమకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కేసును అత్యంత చాకచక్యంగా ఛేదించిన ఒకటో పట్టణ సిఐ సత్యనారాయణ, ఎస్ఐ మదీన బాషా, సిబ్బందిని డిఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డిఎస్‌పితో పాటు ఒకటో పట్టణ సిఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెట్ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఎపి టెట్-2024)లు ఐదో రోజు సోమవారం ప్రశాంతంగా సాగాయి. వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ సిబిఎస్ఇ పాఠశాలలో ఉదయం 9:30 నుంచి 12 గంటల వరకు జరిగిన పరీక్షకు మొత్తం 186 మందికి 168 మంది హాజరయ్యారు. 18 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2:30 నుంచి 5 గంటల వరకు జరిగిన పరీక్షకు మొత్తం 186 మందికి 164 మంది హాజరవ్వగా 22 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం తెలిపారు.

వికలాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మాట్లాడుతున్న మస్తానయ్య

అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకుని ఆత్మస్థైర్యాన్ని ఆయుధంగా మలచుకుని వైకల్యాన్ని అధిగమించాలని సమగ్ర శిక్ష స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ మేనేజ్‌మెంట్, ట్రైనింగ్ డైరెక్టర్ డాక్టర్ వి.ఎన్.మస్తానయ్య అన్నారు. రెండు కాళ్లు కోల్పోయిన మండల పరిధిలోని ముగ్గురు వికలాంగులకు హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో ఆయన చేతుల మీదుగా సోమవారం కృత్రిమ కాళ్లను అందించారు. ఈ కృత్రిమ కాళ్లకు అమెరికాలో ఉంటున్న కీర్తిశేషులు ఇమ్మడి రామకృష్ణ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. వారి కుటుంబాన్ని మస్తానయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సీమాట్ ప్రొఫెసర్ డాక్టర్ శారద, అధ్యాపకులు డాక్టర్ ప్రసాద్, సిఎంఒ టిఎస్‌జి.కన్సల్టెంట్, డాక్టర్ ఎస్.లక్ష్మణ్, హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, సిఇఒ కూరపాటి అజయ్‌కుమార్, సీనియర్ టెక్నిషియన్ కె.చిన్నా పాల్గొన్నారు.

మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లను యధాతథ స్థానాలకు పంపాలి

డిఎంహెచ్ఒ శర్మిష్ఠకు వినతి

వినతిపత్రం అందిస్తున్న మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు

ప్రజాశక్తి ఏలూరు సిటీ

రీ డిప్లాయ్‌మెంట్ పేరుతో 150 కిలోమీటర్లు పైగా పంపిన తమను తిరిగి యధాతథ స్థానాల్లోకి పంపించాలని, అందరికీ ప్రమోషన్లు ఇవ్వాలని కోరుతూ మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్స్ (ఫిమేల్), ఏలూరు డిఎంహెచ్ఒ కార్యాలయం ఎదుట, ఐఎఫ్‌టియు అనుబంధ సంస్థ ఎపి ప్రగతిశీల మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్స్ (ఫిమేల్) అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.శర్మిష్ఠకు వినతిపత్రం అందించారు. అనంతరం ఎపి ప్రగతిశీల మహిళా మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ రాష్ట్ర అధ్యక్షురాలు కె.శిసిల్యమ్మ మాట్లాడుతూ సచివాలయాల్లో పనిచేసే ఎఎన్ఎంలు ట్రైనింగ్‌కి వెళ్లినందున అక్కడ పనిచేసే నిమిత్తం 2022 డిసెంబర్‌లో తమను డిప్యూటేషన్ మీద పంపించారని తెలిపారు. వారు రాగానే తిరిగి యధాతథ స్థానాలకు పంపిస్తామని చెప్పారని, కానీ రెండేళ్లైనా ఇప్పటివరకు తమను తిరిగి పంపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయం ఎఎన్ఎంలు తిరిగి వచ్చి వాళ్ల స్థానాల్లో వారు జాయిన్ అయినప్పటికీ తమను ఇంకా రిలీవ్ చేయలేదన్నారు. అనేక వ్యయ ప్రయాసలకు గురవుతూ భర్తను, పిల్లలను వదులుకుని దూరంగా పనిచేస్తున్నామని, ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలన్నీ విజయవంతం చేస్తున్నామని తెలిపారు. అయినా తమ పట్ల ప్రభుత్వానికి జాలి లేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు తమ రీ డిప్లాయ్‌మెంట్ రద్దు పరిచి తాము ఎక్కడైతే శాలరీ తీసుకుంటున్నామో అక్కడికి తిరిగి పంపించాలని విజ్ఞప్తి చేశారు. గత 30 ఏళ్లుగా ప్రమోషన్ లేకుండా అదే స్థానాల్లో కొనసాగుతున్నామని, తమకు ప్రమోషన్ ఇప్పించాలని కోరారు. త్వరలో తమ సమస్యలు పరిష్కారం కాకుంటే రాష్ట్రవ్యాప్తంగా నిరసన, ఆందోళన కార్యక్రమాలు పొందిస్తామని వారు తెలిపారు. డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.శర్మిష్ఠ స్పందిస్తూ ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియపరుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు యు.వెంకటేశ్వరరావు, యు.ప్రమీల, ఆదిలక్ష్మి, జయమేరి బేబీ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 68వ రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి క్రీడాకారులు 11 మంది బంగారు, రజిత, కాంస్య పతకాలు సాధించినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కె.అలివేలు మంగ తెలిపారు. ఈ నెల రెండో తేదీ నుంచి ఏడో తేదీ వరకు ఎన్‌టిఆర్ జిల్లా నున్నలో నిర్వహించిన ఈ పోటీల్లో అండర్-17 బాలుర గ్రికోరోమన్ విభాగంలో, అండర్-14 బాలురు, బాలికలు ఫ్రీ స్టైల్ విభాగాల్లో పథకాలు సాధించిన క్రీడాకారులను ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలో కూడా పతకాలు సాధించి రానున్న రోజుల్లో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

గ్రావెల్ ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం ఎన్‌టిఆర్ కాలనీ పక్కన ఉన్న సిపిడబ్ల్యూ వాటర్ పంపింగ్ స్కీమ్ ఆవరణలో మట్టి తవ్వి ట్రాక్టర్లపై తరలిస్తుండగా ఎన్‌టిఆర్ కాలనీ వాసులు సోమవారం రాత్రి అడ్డుకున్నారు. విఆర్ఒ అరుణ సంఘటనా స్థలానికి చేరుకుని తహశీల్దార్ పూర్ణచంద్రరావు ఆదేశాల మేరకు రెండు ట్రాక్టర్లును ఉంగుటూరు తహశీల్దార్ కార్యాలయానికి తరలించామని విఆర్ఒ చెప్పారు. సిపిడబ్ల్యూ స్కీమ్ నిర్వహణ గుత్తేదారుడు కంకరను తీసుకురమ్మారని ట్రాక్టర్ డ్రైవర్లు చెబుతున్నారు. కాగా ప్రభుత్వ పనికైనా ముందస్తు సమాచారం, అనుమతి లేకుండా మట్టి, కంకర తరలింపు విధానం సరికాదని విఆర్ఒ చెప్పారు.

నూజివీడు సబ్ రిజిస్ట్రార్‌గా రాఘవరావు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు సబ్ రిజిస్ట్రార్‌గా ఎ.రాఘవరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన సబ్ రిజిస్ట్రార్ సెప్టెంబర్ నెలాఖరున ఉద్యోగ విరమణ చేశారు. ఈ స్థానం ఖాళీగా ఉండటంతో ప్రభుత్వం రాఘవరావును నియమించింది. గతంలో రాఘవరావు ఏలూరు చిట్స్ నుంచి వచ్చారని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం వచ్చే ప్రజలకు నాణ్యమైన సేవలందిస్తానని, నాన్ జ్యుడీషియల్ స్టాంప్స్ కొరత లేకుండా అందుబాటులో ఉంచడమే ప్రధాన లక్ష్యమని చెప్పారు.

ఆగిరిపల్లి ఎంపిడిఒగా భార్గవి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఎంపిడిఒ భార్గవికి వినతిపత్రం అందిస్తున్న సిబ్బంది

ఆగిరిపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బాపతి భార్గవి సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. విజయవాడ రూరల్ మండల ఎంపిడిఒగా పనిచేస్తున్న ఆమె సాధారణ బదిలీల్లో భాగంగా ఆగిరిపల్లి ఎంపిడిఒగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ భార్గవి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అనుగుణంగా సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో ఆగిరిపల్లి మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టిన భార్గవికి కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఎఒ అబ్దుల్ సలాం, జూనియర్ అసిస్టెంట్ విన్సీబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

దెందులూరు ఎంపిడిఒగా శ్రీదేవి

ప్రజాశక్తి - దెందులూరు

దెందులూరు ఎం పిడిఒగా కె.శ్రీదేవి సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. కార్యాలయపు పరిపాలనాధికారులు ఎం.భీమరాజు, వై.సుజాత, సీనియర్ అసిస్టెంట్ కె.కనకరావు, జూనియర్ అసిస్టెంట్ ఎం.రాధాకృష్ణ, ఆమెకు పుష్ప మాలలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

చింతలపూడి ఎక్సైజ్ సిఐగా అశోక్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ఎక్సైజ్ సిఐగా పందిరి అశోక్‌కుమార్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఎస్‌ఈబీ ఎక్సైజ్ శాఖ విధులు నిర్వహించిన ఆయన ఇటీవల బదిలీపై చింతలపూడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపూడి సర్కిల్‌లో సారా అరికట్టడానికి కృషి చేస్తానని చెప్పారు. చింతలపూడి సర్కిల్‌లో 128 మద్యం దుకాణాలకు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

ముసునూరు ఎస్ఐగా చిరంజీవి

ప్రజాశక్తి - ముసునూరు

చిరంజీవి

ముసునూరు ఎస్ఐగా ఎం.చిరంజీవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎలాంటి చట్ట వ్యతిరేకమైన చర్యలు జరగకుండా చూస్తానన్నారు. తమ్మిలేరు పరివాహక ప్రాంతాలు గుళ్లపూడి, వలసపల్లి, ఎల్లాపురం, బలివే, పరివాహక ప్రాంతాల నుంచి ఇసుకు అక్రమ రవాణా జరగకుండా చూడటంతో పాటు, పేకాట, కోడి పందేలు, నాటుసారా అమ్మకాలు కూడా జరపకుండా చూస్తానని తెలిపారు.

రెవెన్యూ అధికారుల పనితీరు మెరుగుపర్చుకోవాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

రెవెన్యూ శాఖ అధికారుల పనితీరు మెరుగుపరుచుకోవాలని ఎంపిపి కారం శాంతి అన్నారు. బుట్టాయగూడెం సర్వసభ్య సమావేశం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు మండలంలోని పలు సమస్యలపై చర్చించారు. ఎంఇఒ తెల్లం బాబూరావు నాడు నేడు కార్యక్రమంలో భాగంగా గత ప్రభుత్వంలో పాఠశాలల అభివృద్ధి పనుల్లో కొంతమేరకు జాప్యం జరిగిందన్నారు. బిల్లులు అవ్వకపోవడం, ఇసుక కొరత ఏర్పడడంతో పనులు త్వరగా జరగలేదన్నారు. గత ఐదేళ్లుగా నిధులు లేవఅనే సాకుతో మారుమూల గిరిజన కొండ రెడ్డికి గ్రామమైన లంకపాకలలోని పాఠశాలను పట్టించుకోవడంలేదని అలివేరు సర్పంచి కారం లక్ష్మి అన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ జ్యోతి, తహశీల్దార్ చలపతిరావు, వైస్ ఎంపిపి మోహన్‌రావు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి తొమ్మిది, పదో తరగతి, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న బిసి, ఇబిసి, సంచార జాతుల సామాజిక తరగతులకు విద్యార్థులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పిఎం యశస్విత పథకం కింద ఉపకార వేతనాలు పొందేందుకు అర్హత కలిగిన విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారిత అధికారి ఆర్‌వి.నాగరాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిది, పదో తరగతి చదువుచున్న విద్యార్థులు ఈ నెల 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుచున్న విద్యార్థులు ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ధరఖాస్తుతో పాటు కుల, ఆదాయ, పాఠశాల/కళాశాల ధృవీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థుల తల్లి తండ్రుల ఆదాయం రూ.2.50 లక్షలకు మించరాదన్నారు. పూర్తి వివరాలకు https://vet.nta.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

ఆరోగ్య కేంద్రాల సేవలు వినియోగించుకోవాలి

ఏలూరు సిటీ : ఆరోగ్య కేంద్రాలు అందిస్తున్న సేవలను ఏలూరు నగర ప్రజలు వినియోగించుకోవాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. ఏలూరులోని లంబాడిపేటలో ఉన్న ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. అనంతరం అక్కడికి వచ్చిన పేషెంట్స్‌తో మాట్లాడుతూ ఏలూరు పట్టణంలో దాదాపు 13 పట్టణ ఆరోగ్య కేంద్రాలు పని చేస్తున్నాయన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో దాదాపు 63 రకాల ఉచిత రక్త పరీక్షలు చేస్తారని తెలిపారు.

గిరిజనులను పట్టించుకోని ప్రభుత్వం : సిపిఐ

కుక్కునూరు : మండల ఏజెన్సీలోని గిరిజనులను ప్రభుత్వం గాలికొదిలేసిందని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అన్నారు. మండలంలోని బండారిగూడెంలో సోమవారం శాఖా కార్యదర్శి మడకం ఇ.రమయ్య అధ్యక్షతన సోమవారం శాఖా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో సమస్యలు తిష్ట వేశాయన్నారు. సమస్యలను పరిష్కరించాలని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని కోరారు.

ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణ

దెందులూరు : పేదవాడికి కిలో రెండు రూపాయాలకే బియ్యం అందించి వారి ఆకలి తీర్చిన ఘనత కీర్తిశేషులు నందమూరి తారక రామారావుకే దక్కుతుందని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. మండలంలోని సోమవరప్పాడులో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ పింఛన్ల పథకం ప్రారంభించి అండగా నిలిచి, పేద వారి సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేసిన తొలి ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ అని అన్నారు.

నేరాలు - ఘోరాలు

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు చోరీ

జీలుగుమిల్లి : మండలంలోని రమణక్కపేట వద్ద ఉన్న అటవీ శాఖ నర్సరీలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు మాయంపై సోమవారం కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ కె.నాగేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... రమణక్కపేట గ్రామ సమీపంలో ఉన్న అటవీ శాఖ నర్సరీలో ఉన్న మోలార్ పని చేయకపోవడంతో సెక్షన్ అధికారి దుర్గారావు ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి చూడగా అందులో రాగి వైరు చోరికి గురైనట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పేకాటస్థావరంపై దాడి

చింతలపూడి : మండలంలోని చింతంపల్లిలో పేకాట స్థావరంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.86 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అధికారులు ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు

ఎంపిపి లంకా నిర్మల

ప్రజాశక్తి - చాట్రాయి

ప్రభుత్వాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజాప్రతినిధులకు సమాచారం అందిస్తూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ ఉండాలని సమస్యలతో వచ్చిన ప్రజలను ఇబ్బందులు పెట్టొద్దని ఎంపిపి లంకా నిర్మల అన్నారు. చాట్రాయి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి బి.శివశంకర్ మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో 11 వేల ఎకరాలు వరి రైతులు సాగు చేస్తున్నారని, ఇ క్రాప్ నమోదు తప్పనిసరిగా రైతులు చేయించుకోవాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి వాటర్ ట్యాంకులు చెడిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మరమ్మతులు చేయించాలని కోరినా మండల విద్యాశాఖాధికారులు పట్టించుకోవటం లేదని వైస్ ఎంపిపి సుబ్బారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపిడిఒ జి.రాణి మాట్లాడుతూ విద్యార్థులకు తాగునీరు అందించాలని, వాటర్ ట్యాంకులకు వెంటనే మరమ్మతులు చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పలు శాఖల అధికారులు పలు సమస్యలపై చర్చించారు.

పర్యావరణ పరిరక్షణకు వన్యప్రాణులు దోహదం

ప్రజాశక్తి - మండవల్లి

పర్యావరణ పరిరక్షణకు వన్యప్రాణులు ఎంతగానో దోహదపడతాయని జెడ్‌పిటిసి సభ్యులు ముంగర విజయనిర్మల స్పష్టం చేశారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా కైకలూరు రేంజ్ అటవీశాఖ ఆధ్వర్యంలో ఇంగిలంపాకలంక గ్రామంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. మానవ మనుగడకు వన్యప్రాణులు ఎంతగానో మేలు చేస్తాయన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు

ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ

ప్రజాశక్తి - ముసునూరు

గ్రామ సభలు నిర్వహించే సమయంలో గ్రామ సర్పంచితో పాటు వార్డు సభ్యులు కూడా పూర్తి బాధ్యతలు చేపట్టి గ్రామస్తులకు సేవలందించాలని ఎంపిడిఒ జి.రాణి, ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచులకు, వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. .

ముదినేపల్లి : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచులకు, వార్డుసభ్యులకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా విచ్చేశారు.

నేటి నుంచి ఉప సర్పంచులు, వార్డు మెంబర్లకు శిక్షణ

జీలుగుమిల్లి : మండలవ్యాప్తంగా ఉన్న 12 పంచాయతీల పరిధిలోని ఉప సర్పంచులు, వార్డు మెంబర్లకు ఆయా పంచాయతీల్లో పలు పాలన అంశాలపై మంగళవారం, బుధవారం రెండు రోజుల పాటు శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి 'మీకోసం'

దెందులూరు : ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా ప్రభుత్వం మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని రూపకల్పన చేసినటు దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు.

నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు

పిడిఎఫ్ టీచర్ ఎంఎల్‌సి అభ్యర్థి బి.గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

విజయవాడ కోర్టుకు హాజరైన యుటిఎఫ్ నేతలు

అక్రమ నిర్బంధం, అక్రమ కేసులు, అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి, పిడిఎఫ్ ఉభయగోదావరి జిల్లాల టీచర్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపీమూర్తి అన్నారు. సిపిఎస్ రద్దు కోరుతూ పోరాటంలో భాగంగా నమోదైన కేసులకు సంబంధించి విజయవాడ కోర్టుకు గోపీమూర్తితోపాటు వివిధ ప్రాంతాలకు చెందిన యుపిఎఫ్ నేతలు, ఇతర ఉపాధ్యాయ సంఘాల నేతలు సోమవారం హాజరయ్యారు. 2022 ఏప్రిల్ నెల 18వ తేదీ నుండి 25వ తేదీ వరకు సిపిఎస్ రద్దు కోరుతూ యుటిఎఫ్ పిలుపులో భాగంగా శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి విజయవాడ వరకు మోటర్ సైకిల్ యాత్ర నిర్వహించామని గుర్తు చేశారు. అనంతరం 25న సిఎంఒ ముట్టడి పిలుపులో భాగంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద యుటిఎఫ్ నాయకులను అడ్డుకొని అక్రమ కేసులు నమోదు చేశారన్నారు. ఆ కేసులపై విజయవాడ మూడో మెట్రోపాలిటన్ కోర్టుకు యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, రాష్ట్ర కార్యదర్శి జివి.రమణ, ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సుందరయ్య, పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి పి.క్రాంతికుమార్, పూర్వపు రాష్ట్ర కౌన్సిలర్ కె.శ్రీనివాసన్, గణపవరం మండల శాఖ ప్రధాన కార్యదర్శి గుబ్బల భవానీ ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.శైలజ, సిపిఎస్ సబ్ కమిటీ సభ్యులు సిహెచ్‌జెఎన్.లక్ష్మి హాజరయ్యారని తెలిపారు. అరెస్టులు చేసి కేసులు పెట్టినంత మాత్రాన పోరాటం ఆగదని, ఒపిఎస్ పునరుద్ధరించే వరకూ వివిధ రూపాల్లో పోరాటం కొనసాగిస్తామని గోపీమూర్తి స్పష్టం చేశారు.

సమస్యల రహిత నియోజకవర్గంగా ఏలూరు

ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

గత వైసిపి పాలకుల నిర్లక్ష్యం కారణంగా సమస్యలకు నిలయమైన ఏలూరును సమస్యల రహిత నియోజకవర్గానికి చిరునామాగా మారుస్తానని ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. ప్రజలిచ్చిన బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వర్తించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నానన్నారు. ఇందులో భాగంగా ప్రతినిత్యం ప్రజా వినతులు స్వీకరించేందుకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నానన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, ఒక వినూత్న కార్యక్రమానికి రూపకల్పన చేశామన్నారు. ఏలూరు నియోజకవర్గంలో సోమవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ఎంఎల్ఎ బడేటి చంటి అధ్యక్షతన నిర్వహించారు. స్థానిక అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంఎల్ఎ చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, తహశీల్దార్ జివి.శేషగిరి పాల్గొన్నారు. అనంతరం ప్రజా వినతులు స్వీకరించారు.

కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని 32వ వార్డులో తిరువూరు బస్టాండ్ సమీపంలో ఆటో స్టాండ్ దగ్గర కల్వర్టు నిర్మాణానికి, రజకపేట రామాలయం దగ్గర మరొక కల్వర్టు నిర్మాణానికి వార్డు ఇన్‌ఛార్జి, మాజీ కౌన్సిలర్ గొల్లు దుర్గాదేవి సోమవారం శంకుస్థాపన చేశారు. కొన్ని నెలలుగా ఇక్కడ డ్రెయినేజీ కాలువలు పాడైపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంత్రి కొలుసు పార్థసారధి ఆదేశాల మేరకు డ్రెయిన్లు కట్టి కల్వర్టులు నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా 32వ వార్డు ప్రజానీకం మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రెసిడెంట్ వాకా రాంబాబు, పార్టీ నాయకులు దుబ్బిరెడ్డి శ్రీనివాసరావు, చిరికి కార్తీక్, ఆదపురెడ్డి భాను, చల్లా రంగారావు, కొలుసు సుబ్బారావు, మున్సిపల్ ఎఇ రేవంత్, వార్డు హెల్త్ సెక్రటరీ లినుబాబు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరు: సిపిఎం

ప్రజాశక్తి - నిడమర్రు

సిపిఎం ప్రజల కోసం, ప్రజా సంమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తుందని సిపిఎం జిల్లా నాయకులు జిల్లా నాయకులు ఆర్.లింగరాజు, జివిఎల్.నరసింహరావు అన్నారు. సిపిఎం తొమ్మిదో మహాసభలు నిడమర్రు ప్రజా సంఘాల కార్యాలయంలో కోన శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ మహాసభలకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు, జివిఎల్.నరసింహరావు హాజరయ్యారు. తొలుత మహాసభ ప్రారంభ సూచికంగా జెండా కంచ వరప్రసాద్ ఎగురవేశారు. ఇటీవల మృతి చెందిన సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, రాష్ట్ర నాయకులు, జిల్లా ఉద్యమ నిర్మాత, మాజీ ఎంఎల్ఎ రుద్రరాజు సత్యనారాయణరాజు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యదర్శి గవర సత్యనారాయణ మూడేళ్ల పాటు జరిగిన కార్యకలాపాల రిపోర్టును ప్రవేశపెట్టారు. సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు ప్రతి ఏడాది వార్షిక జమ ఖర్చులను, మూడేళ్ల జమ ఖర్చులను ప్రవేశపెట్టారు. సిపిఎం కార్యదర్శిగా వెలగలేటి మోహన్‌ను ఎన్నుకున్నారు.

కుక్కునూరు : ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసే పార్టీ సిపిఎం అని ఆ పార్టీ మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు అన్నారు. సిపిఎం మహాసభల సందర్భంగా చీరవల్లి శాఖ మహాసభ యర్నం సాయికిరణ్ అధ్యక్షతన మర్రిపాడు ఆర్అండ్ఆర్ కాలనీలో సిపిఎం సీనియర్ నాయకులు ఊకె ముత్తయ్య జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేంద్రరావు మాట్లాడుతూ కార్మికులు, ప్రజలు, నిర్వాసితులు, గిరిజనుల సమస్యలపై సిపిఎం పోరాడుతుందన్నారు. నిరంతరం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. మూడేళ్ల కాలంలో ప్రజాసమస్యలపై చేసిన పోరాటాలపై సమీక్షించుకుని భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించుకున్నారు. నూతన కార్యదర్శిగా షేక్ ఖాసీంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో సిపిఎం మండల కమిటీ సభ్యులు మేడిపల్లి బాబు, సభ్యులు షేక్ ఖాసీం, ఊకె ముత్తయ్య, మిడియం కృష్ణ పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి..!

మా భూమిని వేరొకరి పేరున మార్చారని వృద్ధ దంపతుల ఆవేదన

కొయ్యలగూడెం: డబ్బులు ఇస్తే చాలు చనిపోయినవారు కూడా రెవెన్యూ రికార్డుల్లో బతికే ఉంటారు. దేనికైనా ఒక రేటు ఉంటుంది. రేటు బట్టి రికార్డుల్లో చోటు ఉంటుంది. ఇదీ కొయ్యలగూడెం తహశీల్దార్ కార్యాలయంలోని తీరు. తహశీల్దార్ కార్యాలయంలో కొందరు వ్యక్తులు అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారారు. రెవెన్యూ రికార్డుల తారుమారుతో తమ బతుకులు రోడ్డున పడ్డాయని మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు సాధనాల సుబ్బారావు, భార్య సౌదామని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వృద్ధ దంపతులు సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద మాట్లాడుతూ డబ్బులకు ఆశపడిన తహశీల్దార్, కార్యాలయంలోని ఉద్యోగులు నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి లక్షలాది రూపాయలు దండుకుంటున్నారన్నారు. వాటిని అడ్డం పెట్టుకున్న వ్యక్తులు కిరాయి వ్యక్తులతో కలిసి నాలుగు రోజుల క్రితం అక్రమంగా తమ పొలంలోకి ప్రవేశించి దౌర్జన్యం చేశారన్నారు. సుబ్బారావు దంపతులు దాదాపు 40 ఏళ్లుగా సాగు చేస్తున్న 219/2, 219/1 సర్వే నెంబర్ కలిగిన 2.74 ఎకరాల భూమిని కొయ్యలగూడెం తహశీల్దార్ కార్యాలయ ఉద్యోగి ఒకరు పకడ్బందీగా పేర్లు మార్చి ఆన్‌లైన్‌లో నమోదు చేశారన్నారు. చనిపోయిన ముంగమూరి సూరయ్య ఖాతా నెంబర్ 145 తోనే యాదవోలకు చెందిన ఎం.సూర్యరమేష్‌కు రూల్స్‌కి వ్యతిరేకంగా ఆన్‌లైన్ చేశారని, అదే భూమి మళ్లీ రాజవరానికి చెందిన పల్లంట్ల అరుణకు చెందిన భూమిగా ఆన్‌లైన్ చేశారని చెప్పారు. ఖాతా నెంబర్ ఒక వ్యక్తికి కేటాయించిన తరవాత వేరొక వ్యక్తికి భూమి మార్పు చేస్తే ఖాతా నెంబర్ కూడా మారుతుందని, కాని అటువంటిది ఏమీ లేకుండానే ఇద్దరు వ్యక్తులకు చనిపోయిన వ్యక్తికి చెందిన నెంబర్‌తోనే ఆన్‌లైన్ చేయడం అన్యాయం, అవినీతి అన్నారు. రాజవరం గ్రామంలోనే మరొక చోట 378/2 హెచ్, 382/21, సర్వే నెంబర్‌లోని 1.84 సెంట్ల భూమి కూడా తాము 30 ఏళ్ల నుంచి సాగు చేస్తున్నామన్నారు. దానిని కూడా చీకట్ల పాటమ్మ (ఖాతా నెంబర్ 141) పేరిట సిహెచ్.గంగరాజుకు అనుకూలంగా ఉండేటట్లు అక్రమంగా ఆన్‌లైన్ నిర్వహించారని వృద్ధ దంపతులు వాపోయారు. ఇటీవల నిర్వహించిన జగనన్న రీసర్వే ఆర్ఒ ఆర్ రికార్డ్సులలో రెండు చోట్ల సదరుభూమి తమ ఆధీనంలోనే ఉన్నట్లు రెవెన్యూ అధికారులు నిర్ధారించారన్నారు. కాని మండల రెవెన్యూ కార్యాలయంలోని ఉద్యోగులు తమను మోసం చేసి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి వేరొకరికి ఇచ్చారన్నారు. కోట్ల రూపాయల విలువైన పొలం కావడంతో భూ కబ్జాదారుల కళ్ళు తమపై పడ్డాయన్నారు. తాము ఏమి చేయలేమనే ఉద్దేశంతో రాజవరం గ్రామానికి చెందిన వ్యక్తులు దందాలు నిర్వహిస్తూ ఈ దుర్మార్గానికి ఒడిగట్టారని ఆవేదన చెందారు. రాజవరం పంచాయతీ పరిధిలో తమకు రెండు చోట్ల ఉన్న భూములను లాక్కునేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తుల నుంచి లక్షల రూపాయాల్లో ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. వారం రోజుల క్రితం తమ భూమిలోకి ప్రవేశించడమే కాకుండా పొలంలో నుంచి వృద్ధులమని కూడా చూడకుండా గెంటేశారన్నారు. సాటి రైతులు ఎదురు తిరిగి వాళ్లతో ఘర్షణ పడడంతో వెళ్లిపోయారని, కాని మళ్లీ వస్తాం, మీ అంతు చూస్తామని బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. దీనిపై తహశీల్దార్ చెల్లన్నను వివరణ కోరగా విచారించి చర్యలు తీసుకుంటామని, వృద్ధ దంపతులకు న్యాయం చేస్తామని చెప్పారు. వృద్ధులకు వామపక్ష పార్టీల నాయకులు మద్దతు తెలిపారు.

ఇస్రోలో పని చేస్తున్నానని మోసం

నాలుగు వివాహాలు చేసుకున్న వ్యక్తి అరెస్టు

ఏలూరు స్పోర్ట్స్ : కాదేది మోసానికి అనర్హం అన్న చందంగా ప్రస్తుతం మోసపూరితమైన వ్యవహారాలు వెలుగులోకి వస్తున్నాయి. ఓ వ్యక్తి ఇస్రోలో పనిచేస్తున్నానని పలువురిని నమ్మించి నలుగురిని వివాహాలు చేసుకుని మోసానికి పాల్పడ్డాడు. దీనిపై కేసు నమోదు చేసిన భీమడోలు పోలీసులు అతన్ని కటకటాలపాలు చేశారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటగిరి మండలం బంగారుపేట గ్రామానికి చెందిన అంశం అనిల్‌బాబు ఇస్రోలో పనిచేస్తున్నానని, తన పేరు అంశం అనిల్‌బాబు అని, వివాహం కోసం తాను ప్రయత్నిస్తున్నానని మ్యాట్రిమోనీలో పెట్టాడు. ఏ పెళ్లి సంబంధాలు అతనికి రాకపోవడంతో అతని పేరును అనిల్ బాబు నుంచి కళ్యాణ్ రెడ్డిగా మార్చుకుని ఇస్రోలో పనిచేస్తున్నట్లు మరోమారు మ్యాట్రిమోనీలో వివరాలు పొందుపరిచాడు. అంతటితో ఆగకుండా తాను విసిరోలో పని చేస్తున్నట్లు అందరిని నమ్మించేందుకు ఒక కారును అతని తోపాటు ఇద్దరు బౌన్సర్లను ఓ మహిళ అసిస్టెంట్‌ను కూడా తన వెంట తిప్పుకుంటూ పలువురిని మోసం చేయడం మొదలు పెట్టాడు. ఓ విల్లాను అద్దెకు తీసుకుని ఆ విల్లా కూడా తనదేనంటూ దాదాపు వంద ఎకరాల ఆసామిగా తనను తాను పరిచయం చేసుకుంటూ మొత్తంగా నలుగురు మహిళలను వివాహమాడాడు. వివాహ సమయంలో అతనే అతని తండ్రిగా నటిస్తూ పెళ్లి కుమార్తె బంధువులనుచ తల్లిదండ్రులను మోసం చేస్తూ వచ్చాడు. చివరిగా భీమడోలు మండలం గుండుగొలను గ్రామానికి చెందిన మహిళను వివాహమాడేందుకు వాళ్ల ఇంటికి వెళ్లిన సమయంలో బంధువులకు ఇస్రోలో ఉద్యోగాలు ఇప్పిస్తామని వారిని నమ్మించి వారి వద్ద నుంచి దాదాపుగా రూ.పది లక్షలు తన ఖాతాకు కాకుండా తెలిసిన వివిధ ఖాతాలకు మళ్లింపు చేశాడు. రోజులు గడుస్తున్నప్పటికీ ఇస్రోలో ఉద్యోగాలు లేవు సరి కదా ఇచ్చిన సొమ్మును కూడా తిరిగి ఇవ్వడం లేదని తాము మోసపోయామని గ్రహించిన గుండా లక్ష్మీకుమారి భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసిన భీమడోలు సిఐ యుజె విల్సన్ నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితులను అదుపులోకి తీసుకున్న తర్వాత అన్ని విషయాలు వెలుగులోకి వచ్చాయి. పూర్తి వివరాలు సేకరించిన పోలీసులు అతనితో పాటు అతని అసిస్టెంట్ శశాంక, డ్రైవర్ పల్లె హేమంత్‌రెడ్డిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.రెండు లక్షల నగదు, ఒక కారు, ఐదు సెల్ ఫోన్లు, 13 సిమ్ కార్డులు, అలాగే ప్రజలను మోసం చేయడానికి వినియోగించే అపాయింట్మెంట్ లెటర్స్, కంప్యూటర్, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌పి తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE AT WARANGAL
A.S. No. 168 of 2022
(Old A.S. No. 123 of 2019)

Between:
Nagamalla Sree Devi ...Appellant
And
V.Chandra Mohan ...Respondent
To
RESPONDENT: V.Chandra Mohan, S/o: Parasuramulu, Age: 62 years, Occu: Retd.Employee, R/o: H.No.4-77, Main Road, Near SBI, Undi Mandal, West Godavari District, Andhra Pradesh.
Please take notice that the appellant has filed the above appeal aggrieved against the decree and judgment passed in O.S. No.482 of 2010, the appellant has preferred the above appeal. The above case is posted **21.10.2024** for your appearance. Therefore you are hereby directed to appear before the Hon'ble court on **21.10.2024** at 10:30 am failing which the matter will be decided in your absence.
// BY THE ORDER OF THE COURT//
CH.SWAMYNATHAN
ADVOCATE
H.NO.12-1-70.S.V.N.ROAD,
WARANGAL

ప్రకటన
మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
FDP I.A No. 320/2024 in O.S. No. 245/2015

Plaintiff/Petitioner:
Dasetti Appala narasamma
and
Respondent/Defendant:
1. Muchi Srinivasa rao (died)
2. Muchi Lakshmi W/o Late Srinivasa rao
3. Muchi Teja S/o Late Srinivasa rao
4. Muchi Srija Rani D/o Late Muchi Srinivasa rao

పై నెంబరు పిటీషన్ అనగా **FDP I.A No. 320/2024 in O.S. No. 245/2015** లో అనేక పర్యాయములు మీకు నోటీసులు కోర్టు ద్వారాను, రిజిస్టార్ పోస్టు ద్వారాను పంపించినను, వాటిని మీరు ఉద్దేశ్య పూర్వకంగా అందుకొని యుండలేదు. అందువలన శ్రీ కోర్టు వారు **Substitute Service** ద్వారా నోటీసు అమలుచెయ్యమని ఆర్డరు వేసియున్నారు. అందువలన మీరు **ది. 22-10-2024 తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయముగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరై పై కోర్టు వారి ఎదుట మీ ఆక్షేపణలు తెలియ పర్చుకోవలెను. అట్లు హాజరు కానిచో పరోక్షములో సదరు పిటీషన్‌ను తీర్మానించబడునని ఇందుమూలముగ తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
P. Raja Rao
Advocate
భీమవరం Bhimavaram
వాయిదా తేది: 22-10-2024 Cell: 94401 30111

బాణసంచా అక్రమంగా నిల్వ ఉంచితే చర్యలు

టి.నరసాపురం : అనుమతులు లేకుండా మందుగుండు సామగ్రి నిల్వలు ఉంచితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఎం.జయబాబు హెచ్చరించారు. సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దీపావళి పండుగను పురస్కరించుకుని మండలంలో ఎక్కడ బాణసంచా సామగ్రి నిల్వలు ఉన్నా వెంటనే సీజ్ చేస్తామని, గతంలో లైసెన్సులు పొంది దీపావళి షాపులు ఏర్పాటు చేసుకుని బాణసంచా విక్రయదారులు మిగిలిన బాణసంచా సామాగ్రిని వెంటనే పర్మినెంట్ గోడౌను కలిగిన షాపుల వద్ద భద్రపరుకోవాలని సూచించారు.

ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A No. 56/2022 in O.S. No. 105/2022

State Bank of India main Branch, Rep/Branch Manager -*Plaintiff*
and
Yerra Gowthami -*Defendant*
యిందు మూలముగా మీకు తెలియ చేయునది ఏమనగా పై నెంబరు గ్రంధములో మీరు ప్రతివాది అయియున్నారు. సదరు ప్రతివాది అయిన మీరు అనగా Smt. Yerra Gowthami, W/o Srinivasa Rao, C/o Sri lakshmi Bakery and Fast Foods, Near new Flyover Kadakatla, Tadepalligudem
మీకు ఎన్నిసార్లు కోర్టు ద్వారా సమన్లు పంపినప్పటికీ తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు అని శ్రీ కోర్టు వారు **Substitute Service** ద్వారా నోటీసు అమలు జరుపుటకు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. సదరు పై గ్రంధములో **ది. 23-10-2024 తేదీన** వాయిదా అయి ఉన్నది. ఆ రోజున మీరు స్వయముగా గాని, న్యాయవాది గారి ద్వారా గాని **ది. 23-10-2024 తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు ఉన్నయెడల తెలియజేసుకోమని కోరడమైనది. లేని యెడల శ్రీ కోర్టు వారు సదరు దావా మీకు పరోక్షముగా తీర్మానము చేయబడును అని తెలియచేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
P. Sudhakara Rao
Tadepalligudem State Bank of India
Panal Advocate
Dt: 07-10-2024 Tadepalligudem
Cell: 94401 44620

ప్రకటన

పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం మునిసిపాలిటి, తాడేపల్లిగూడెం టౌన్ ఇలాకాలోని కెనరా బ్యాంకు, తాడేపల్లిగూడెం ప్రస్తుత మేనేజర్ **శ్యామల రామకృష్ణారెడ్డి** గారి **కుమారుడు జనార్ధనరెడ్డి** అను నేను ప్రమాణం పై తెలియజేయునది.
నేను ప్రస్తుతం తాడేపల్లిగూడెం కెనరా బ్యాంకులో మేనేజర్‌గా పనిచేయుచున్నాను. లోగట సిండికేట్ బ్యాంకును కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కెనరా బ్యాంకు లో విలీనం చేసి ఉన్నారు. సదరు సిండికేట్ బ్యాంకులో **గంట శ్రీనివాసరావు** మరియు ఆయన భార్య **గంట సరళ** హౌసింగ్ లోను **(Housing Loan)** తీసుకుని ఉన్నారు. దర్శిల సదరు సిండికేట్ బ్యాంకును కెనరా బ్యాంక్‌లో విలీనం చేసియున్నారు. **Housing Loan** ఇచ్చినప్పుడు సదరు **గంట శ్రీనివాసరావు** మరియు అతని భార్య తాలూకు డాకుమెంట్స్ నెంబర్స్ 4552/2002, 708/2008, 477/2008, 1413/1969 గల దస్తావేజులను **Deposit of Title Deed, S.R.O** తాడేపల్లిగూడెంలో కెనరాబ్యాంకు పేరుమీద రిజిస్టేషన్ చేసియున్నారు. దర్శిల వారి కుమారులు **గంట మేఘసాద్, గంట దీపక్** అనువార్లు పేరుమీద ఎడ్యుకేషన్ లోన్స్ తీసుకొని బ్యాంకు వారికి కట్టవలసిన బాకీలు కట్టివేసి **S.R.O** తాడేపల్లిగూడెంలో **Deposit of Title Deed,** ని రద్దు చేసియున్నారు. సదరు రద్దు అయినట్లుగా E.C లో మార్క ఉన్నది. దర్శిక సదరు డాకుమెంట్స్ తిరిగి ఇవ్వడానికిగాను, బ్యాంకులో తనిఖీచేయగా సదరు **Original Documents** గల పైలు బ్యాంకులో వేరొక రికార్డులో లేక ఇతర రికార్డులలో మిస్సింగ్ కాబడి ఉన్నది. గత నెల రోజులనుండి వెతికించినప్పటికి కనిపించలేదు. సదరు **Original Documents Folder** మొత్తం మిస్సింగ్ కాబడి ఉన్నది. సదరు విషయం బ్యాంకు ఉన్నతాధికారులు పోలీస్ రిపోర్టు ఇచ్చి మిస్సింగ్ **F.I.R** ని రిజిస్టారు చేయించమని ఫోనులో ఆదేశాలు ఇచ్చినారు. సదరు ఆదేశాల ప్రకారం **ది. 7-10-2024 సం॥ తేదినా** తాడేపల్లిగూడెం టౌన్ పోలీసు స్టేషన్‌లో రిపోర్టు ఇచ్చి ఉన్నారు. కావున బ్యాంకు పరిసర ప్రాంతాలలో గాని, మరియు బ్యాంకు కస్టమర్లు ఎవరైనా దొరికిన యడల ఈ ప్రకటన వెలువడిన 15 రోజులలోపుగా బ్యాంకు వారికి ఇచ్చి సహకరించవలసినదిగా ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయటం అయినది.
శ్యామల జనార్ధనరెడ్డి
తాడేపల్లిగూడెం మేనేజర్ కెనరా బ్యాంక్
07-10-2024

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P. 134/2009, O.S. 82/2002

Between:
1) జుత్తిగ వెంకాయమ్మ (died)
2) శీలం వరలక్ష్మి @ చంటి, W/o. వెంకట భాస్కరరావు, సాయి కాలనీ, పెరవలి, పెరవలి మండలం ...DHrs
(2nd DHr is add as LR of deceased జుత్తిగ వెంకాయమ్మ in EA 89/2023, dated: 10-11-2023)
Vs
మల్లిపూడి అనసూయ @ ఏలూరి అనసూయ, W/o. వీర రాఘవరాజు, హిందూ, వయస్సు 55 సం॥లు, Health Visits, Near Junior College, కొయ్యలగూడెం ...JDr

వేలం తేది: 01-11-2024
ఈ నెంబరు E.P. యిస్తిహారు దాఖలా షెడ్యూలు ఆస్తిని పై కోర్టు వారి ఎదుట **ది. 01-11-2024వ తేదీన ఉదయం 10.30 ని॥ల** లగాయితు వేలం జరుగును. వేలం నందు పాట పాడుకొనదలచినవారు వేలపు షరతులు DHr తరపు ప్లీడరు గారి ఆఫీసు నందు కాని, మరియు కోర్టు నజారత్ నందు తెలుసుకోగలరు.

షెడ్యూలు
ఏలూరు జిల్లా, Previous పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం SRO, కొయ్యల మండలం, రాజవరం గ్రామంలో ఆర్.ఎస్. నెం. 1/1లో య. 7-84 ట్లులో ఉత్తరం వైపు య. 3-00 ట్లులో పడమర వైపు య. 1-00లు భూమికి హద్దులు.
తూర్పు: యీ నెంబరులో మల్లిపూడి @ ఏలూరి అనసూయ తాలూకు మిగతా భూమి. **దక్షిణం:** మల్లిపూడి సోమయమ్మ గారి భూమి. **పడమర:** వంకదారి మంగరాజు భూమి. **ఉత్తరం:** పి.పెంటయ్య భూమి.
ఈ హద్దుల మధ్య గల య. 1-00 సెంట్లు భూమి, అందలి గల నానావిధ ఫలవృక్షములతో సహా మరియు *eawement* హక్కులతో సహా.
DHr విలువ: రూ. 1,00,000/-
Amin విలువ: రూ. 5,60,000/-
సబ్‌రిజిస్ట్రార్, జంగారెడ్డిగూడెం విలువ: రూ.8,00,000/-
JDr విలువ: Nil
ది. 8-9-2004వ తేదీన JDr మల్లిపూడి సునయన కుమారి పేర Settlement deed వ్రాయించి యిచ్చినది. సదరు Settlement deed ను Annual చేయించమని DHr Kovvur Principal Senior Civil Judge వారి కోర్టులో IP 52/2004 రున Creditor IP దాఖలు చేయగా, సదరు Settlement deed Annural కాబడినది. అందుచే సదరు Settlement deed కు లోబడనవసరం లేదు. Hence Encumbrance Nil, as per E.C.
SANYASI RAO.K
Kovvur Advocate, Kovvur
Dt. 31-8-2024 Cell: 98488 71229